క్లుప్తంగా

ఉత్సవ కమిటీ ఏర్పాటు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 8 నుంచి 13 వరకు నిర్వహించే శివ రాత్రి ఉత్సవాల కోసం ఎండోమెంట్ అధికారులు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. శివ రాత్రి కల్యాణ, ఊరేగింపు, తదితర పూజా కార్యక్రమాల నిర్వహణ 11 మంది సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించుకోవాలని ఎండోమెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మడుగూరు ప్రసాద్, వల్స తిరుపతి, దుర్గం కొమురయ్య, సోమందవు నర్సింహులు, పెద్దబోయిన అర్జున్, చెన్నం లాలమ్మ, ఇర్సవడ్ల పూర్ణచందర్(కిరణ్), ఎర్రవేణి రాంలాల్, కర్ల అరుణ, కట్కూరి రాధిక, గార పోషాలను ఉత్సవ కమిటీ సభ్యులుగా నియమించినట్లు అధికారులు ఉత్తర్వులు పేర్కొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



గోవిందరావుపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం పస్రా సీఐ శంకర్, ఎస్సై షేక్ మస్తాన్ కలిసి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఎస్ఎస్ తాడ్వాయిలో..



ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులు రాస్తున్న పరీక్షను పరిశీలించారు. పరీక్ష కేంద్రంలోని సౌకర్యాలపై ఆరా తీశారు.

వాహనాల..



వాజేడు: మండల పరిధిలోని మొరుమూరు కాలనీ వద్ద వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాజేడు, భద్రాచలం రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని సోదాలు చేశారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుమానితులు, కొత్తవారు తరస పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆర్థిక సాయం



వాజేడు: తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్‌గా పని చేస్తున్న భార్గవ్ కుటుంబం వేములవాడ శివుడి దర్శనానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో అతడి తండ్రి, బాబాయి, చెల్లెలు మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని కార్యాలయ సిబ్బంది పరామర్శించి భార్గవ్ తల్లికి రూ.25500 ఆర్థిక సాయం అందించారు. తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రాహుల్ చంద్ర వర్మ, ఆర్ఐ రాజు, కార్యాలయ సిబ్బంది వెంకటయ్య, నాగరాజు, రాంబాబు, బాల కృష్ణ, అనూష, తిరుపతమ్మ, బాలచంద్ర మూర్తి, ధనమ్మ ఉన్నారు.

బియ్యం అందజేత

మహాముత్తారం: మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కన్నెవేణి ఐలి కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మృతిడి కుటుంబ సభ్యులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించి, 25కేజీల బియ్యాన్ని ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, లిక్కిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కానరాని శివరాత్రి సందడి!

- మూతబడిన శివాలయాలు
- ఉత్సవాలకు పక్క గ్రామాలకు వెళ్తున్న భక్తులు

వాజేడు: మండలంలోని శివాలయాలు పలు కారణాలతో మూతపడ్డాయి. దీంతో శివుడికి నిత్య పూజలు నిర్వహించడం లేదు. కనీసం మండలంలో శివరాత్రి ఉత్సవాల సందండి కూడా కనబడటం లేదు. ప్రజలు శివరాత్రి రోజున శివుడికి ఎంతో నిష్ఠగా పూజలు చేస్తారు. అలాంటిది మండలంలో శివాలయాల నిర్వహణ సక్రమంగా లేక భక్తులు పూజలకు దూరమవుతున్నారు. శివుడికి పూజలు చేసేందుకు పక్క ఊరుకు వెళ్లి చేయాల్సిన పరిస్థితి మండలంలో ఏర్పడింది. మండల పరిధిలోని వాజేడు, ప్రగళ్లపల్లి, అయ్యవారిపేట గ్రామాల్లో శివాలయాలు ఉన్నాయి. ఇందులో ప్రగళ్లపల్లిలోని శివాలయం మినహా వాజేడు, అయ్యవారిపేట శివాలయాల పరిస్థితి దారుణంగా ఉంది.

మూతబడిన వాజేడులోని శివాలయం

మండల కేంద్రంలో 1976లో కాకర్లపూడి వీరభద్ర రాజు శివాలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం శివరాత్రి నాడు జరిగే శివపార్వతుల కల్యాణానికి వాజేడు, వెంకటాపురం, చర్ల మండలాల భక్తులే కాకుండా గోదావరి అవతలి వైపున ఉన్న మధ్యప్రదేశ్ నుంచి కూడా భక్తులు తరలివచ్చేవారు. వీర భద్రరాజు సొంత ఖర్చులతో ఎంతో ఘనంగా కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించే వారు. అలాంటిది కొన్ని సంవత్సరాల క్రితం ఆయన మృతి తరువాత దేవాలయంలో జరిగిన చోరిలో శివపార్వతులకు సంబంధించిన కొన్ని ఆభరణాలు దొంగిలించబడ్డాయి. గుడిలో దొంగతనం జరుగడం అరిష్టంగా భావించి శాస్త్రోక్తంగా యాగాలు, హోమాలు జరిపించి గుడిని మూయించారు.



వాజేడులో మూత పడ్డ శివాలయం

శిథిలమైన అయ్యవారిపేట శివాలయం

కాకతీయుల కాలంలో నిర్మించిన దేవాలయంగా అయ్యవారిపేట శివాలయాన్ని చెప్పుకుంటారు. ఈ దేవాలయం గోదావరి ఒడ్డున ఉండటం విశేషం. కాకతీయులు కట్టించారనడానికి కిలా వరంగల్ కోటలో ఉన్న విగ్రహాల లాంటి శిలా విగ్రహాలు ఉన్నాయి. 1986లో వచ్చిన గోదావరి వరదల సమయంలో ఇక్కడి ఆలయం శిథిలమైనట్లు ఈ ప్రాంత భక్తులు తెలిపారు. ఈ శివాలయం వద్ద కేవలం శివ పార్వతుల విగ్రహాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఆ దేవతా మూర్తుల విగ్రహాలకు చుట్టూ పరదలు కట్టి వాటికి పూజలను నిర్వహిస్తున్నారు. .

పట్టించుకోని దేవాదాయ శాఖ

వాజేడులోని శివాలయానికి ఎంతో పేరున్నప్పటికి దేవాదాయ శాఖ మాత్రం పట్టించు కోవడం లేదు. దేవాదాయ శాఖ నుంచి రెండు సార్లు వచ్చిన అధికారులు శివాలయాన్ని పరిశీలించి వెళ్లారు. ఆ సమయంలో శివాలయం తెరుస్తారని శివపార్వతులకు పూజలు చెయవచ్చని భావించిన భక్తులకు నిరాశనే ఎదురైంది.



అయ్యవారి పేట శివాలయం

ఈనెల 08న శివరాత్రి

ఈ నెల 08న మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. దేవాలయాలు శిథిలావస్థలో ఉండటంతో మరోమారు కూడా ఉత్సవ కల్యాణంతోనే సరిపెట్టుకోవాల్సివస్తుంది. జంగాలపల్లిలో ఉత్సవ కల్యాణ వేడుకలను జరిపించనుండగా అయ్యవారిపేటలో మాత్రం శివపార్వతుల విగ్రహాలకు కల్యాణం నిర్వహించనున్నారు. ప్రగళ్లపల్లి గ్రామంలో స్థానికులు గుడిని సొంత ఖర్చులతో నిర్మించారు. ఇక్కడ ఘనంగా కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.

వాల్‌పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ

మంగపేట: మండల కేంద్రంలోని శ్రీ ఉమాచంద్రశేఖరస్వామి ఆలయంలో ఈనెల 08న మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే మహోత్సవ వాల్‌పోస్టర్లు, కరపత్రాన్ని శ్రీ ఉమాచంద్రశేఖరస్వామి దేవస్థానం చైర్మన్ కోలగట్ల నరేష్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ఈనెల 08న తెల్లవారు జామున 04 గంటల నుంచి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు మధ్యాహ్నం 12 గంటల వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 06 గంటల నుంచి 07 గంటల వరకు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, భజన కార్యక్రమాలను నిర్వహించినున్నట్లు తెలిపారు. అదే రోజు రాత్రి 11 గంటలకు శ్రీ ఉమచంద్రశేఖరస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులచే శాస్త్రోక్తంగా అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవం కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసి దేవుని ఆశీస్సులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి నరేష్‌శర్మ, కమిటీ సభ్యులు కొమరగిరి కేశవరావు, సాంబ్రాజ్యం, చాద మల్లయ్య, కల్లెబోయిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చైర్మన్ నరేష్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

రేగొండ(కొత్తపల్లిగోరి): గ్రామాలను అన్ని విధాల అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం రేగొండ మండలంలోని రావులపల్లి గ్రామంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం, కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి, గాంధీనగర్, విజ్జయ్యపల్లి గ్రామాలలో ఒక్కో భవనానికి సుమారు రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని అన్నారు. ఆరు గ్యారంటీల పథకంలో భాగంగా ఇప్పటికే నాలుగు హామీలను అమలు చేశాం అన్నారు.

మొగుళ్లపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వివిధ గ్రామాలకు చెందిన 28 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం బస్టాండ్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు.

ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

వెంకటాపురం(కె): ప్రజలు ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వెంకటాపురం సీఐ బండారి కుమార్ సూచించారు. ప్రజలకు ఎన్నికల్లో విశ్వాసం కలిగే విధంగా సీఆర్పీఎఫ్ బలగాలతో కలిసి మండల కేంద్రంలో మంగళవారం ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. మావోయిస్టు ప్రాభావిత ప్రాంతాల్లో ప్రజలు సంఘ విద్రోహ శక్తుల నుంచి ఎలాంటి భయంతోళన లోనవ్వకుండా ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కొప్పుల తిరుపతి రావు, అశోక్, రమేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కొనసాగిన 'పల్స్ పోలియో'

ఏటూరునాగారం: మండలంలోని మారుమూల అటవీగ్రామాలు దొడ్ల, కొండాయి, మల్యాల, కొత్తూరు గ్రామాల్లో కన్నాయిగూడెం ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. అలాగే పల్స్ పోలియో కార్యక్రమం మూడవరోజులో భాగంగా వైద్యాధికారి డాక్టర్ అభినవ్ ఆధ్వర్యంలో ఐదు సంవత్సరముల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. అనంతరం అభినవ్ మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండాయి మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ తిరుపతయ్య, హెల్త్ సూపర్వైజర్ రమణకుమారి, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్ రావు, ఆశ కార్యకర్తలు భాగ్యలక్ష్మి, సునీత, రాణి, రమాదేవి, సరస్వతి పాల్గొన్నారు.

మహదేవపూర్: మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మూడవ రోజు పల్స్ పోలియో కార్యక్రమం మంగళవారం కొనసాగింది. మహారాష్ట్ర, ఛతీష్‌గఢ్ రాష్ట్రాల నుంచి మిర్చి కాయలు తెంపుటకు వచ్చి పెద్దంపేట వాగులో గుడారాలు వేసుకున్న కూలీల పిల్లల వద్దకు వెళ్లి పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, హెల్త్ అసిస్టెంట్ మషుక్ ఆలీ పాల్గొన్నారు.



పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ అభినవ్

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



ఐటీడీఏ పీఓతో నాయకులు

ఏటూరునాగారం: ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రా నూతనంగా పీఓగా బాధ్యతలను చేపట్టడంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు మాట్లాడుతూ వెనుకబడిన ఏజెన్సీ ప్రాంత గిరిజనుల సమస్యల పరిష్కారం, పేదల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కృషి చేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎండీ ఖలీల్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, టౌన్ అధ్యక్షుడు ఎండీ సులేమాన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జనజీవన స్రవంతిలో కలవాలి



గోవిందరావుపేటలో పోస్టర్లు అంటిస్తున్న పోలీసులు



వాజేడులో..



ఎస్ఎస్‌తాడ్వాయిలో..

ఎస్ఎస్ తాడ్వాయి: మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసులు కోరారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు జనజీవనంలోకి రావాలని మండల కేంద్రంలో పలుచోట్ల పోలీసులు మంగళవారం పోస్టర్లు అంటించారు. లొంగిపోవాలనున్న మావోయిస్టులు ఉన్నతాధికారులను సంప్రదించేలా ఎస్పీ, ప్రత్యేక పోలీస్ అధికారి ఫోన్ నంబర్లను పోస్టర్లపై రాసి ఉంచారు.

గోవిందరావుపేట: మావోయిస్టులను జన జీవ స్రవంతిలో కలవాలని తెలియజేసే వాల్ పోస్టర్లను ములుగు ఎస్పీ డా.పి.శబరీష్ ఆదేశాల మేరకు పస్రా సీఐ శంకర్, ఎస్సై షేక్ మస్తాన్ సిబ్బందితో కలిసి పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలలో అంటించారు. ఈ సందర్భంగా పస్రా సీఐ మాట్లాడుతూ.. మావోయిస్టులు హింస సిద్ధాంతాలు వదిలేసి వనం వీడి జనంలోకి వచ్చి తమ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని అన్నారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు అందరూ జనజీవన స్రవంతిలోకి రావాలని, లొంగిపోయిన మావోయిస్టులకు పోలీసులు ప్రభుత్వం తరుపున సరైన సాయం అందిస్తామని అన్నారు. పస్రా ఎస్సై షేక్ మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

వాజేడు: మండల పరిధిలోని పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం పేరూరు ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో మావోయిస్టులకు పునరావాసం కల్పించడానికి సంబంధించిన పోస్టర్లను పోలీసులు అతికించారు. మా వద్దకు వచ్చిన వెంటనే మీ ఇంటికి వెళ్లవచ్చు మీ పునరావాసం తెలంగాణ ప్రభుత్వ హామీ అని ఉన్న పోస్టర్లను అతికించారు.

పల్స్ ఆక్సీ మీటర్ల పంపిణీ



ఆక్సీ మీటర్లు అందజేస్తున్న సురేష్

మంగపేట: మండలంలోని పలు బాలుర, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలకు ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పల్స్ ఆక్సీ మీటర్లను ఉచితంగా మంగళవారం పంపిణీ చేసినట్లు ఐఆర్‌సీఎస్ ఎంసీ మెంబర్ కల్లె బోయిన శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని చుంచుపల్లిలోని కస్తూరిబా, ప్రభుత్వ గిరిజన బాలికల, బ్రహ్మణపల్లి, కోమటిపల్లి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలతో పాటు తిమ్మంపేట గిరిజన బాలుర వసతి గృహంలో ఆక్సీ మీటర్లను సంబంధిత వార్డెన్లకు అందజేసినట్లు ఆయన తెలిపారు.

'ఒక వర్గంపై కేసుల నమోదు సరికాదు'

ములుగు రూరల్: గట్టమ్మ ఆలయం వద్ద ఆదివాసీ నాయకపోడ్‌లకు, ముదిరాజ్ సంఘాల సభ్యులు ఘర్షణకు పాల్పడితే పోలీసులు ముదిరాజ్ సంఘం సభ్యులపై కేసులు నమోదు చేయడం సరికాదని మెపారాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయం వద్ద ఇరు వర్గాలు గొడవకు దిగిన సమయంలో పోలీసులు అక్కడే ఉన్నారని అన్నారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఘర్షణకు ప్రేరేపించిన నాయకపోడులపై కేసు నమోదు అన్నారు. ముదిరాజ్ సంఘం సభ్యులుపై అట్రాసిటీ కేసు నమోదు చేయడం సరికాదని అన్నారు.

మాలలకు అవకాశం కల్పించాలి

వెంకటాపురం(ఎం): వరంగల్ పార్లమెంట్ స్థానం ఎస్సీ రిజర్వేషన్ ఉన్నందున ఎస్సీ మాలలకు అవకాశం కల్పించాలని తెలంగాణ మాల పోరాట సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు అన్ని పార్టీల నేతలను కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం పాటుపడదాం అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం వెంకటాపురం మండలంలోని నర్సాపూర్ గ్రామంలో పర్యటించి కాలనీవాసులతో మాట్లాడారు. మాలలకు ఏ పార్టీ అవకాశం కల్పించిన ఆ అభ్యర్థిని గెలిపించుకునేందుకు మాలలంతా ఐకమత్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకేశ్వరపు రమేష్, రాష్ట్ర కార్యదర్శి మునిగంటి రమేష్, ఉపాధ్యక్షుడు స్వామి, నాయకులు పైడి, రాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

వెంకటాపురం(కె): మండల పరిధిలోని విజయపూరి కాలనీలో పురుగుల మందుతాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. విజయపూరి కాలనికి చెందిన గగ్గురి పోశమ్మ (27) భర్త శ్రీశైలం కొంత కాలంగా మద్యానికి బానిసై కుటుంబ బాధ్యతలను పట్టించుకోకుండా తిరుగుతున్నాడని తెలిపారు. కాగా శ్రీశైలం పెడుతున్న ఇబ్బందులు పోశమ్మ మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడిందని తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు పోశమ్మను ఎదిర వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారని పరిస్థితి విషమంగా ఉండటంతో భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. కాగా మంగళవారం మృతురాలి తండ్రి వాదం ముత్యాలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అశోక్

సద్వినియోగం చేసుకోవాలి

కాటారం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బాబు, ఎంపీఓ ఉపేంద్రయ్య మంగళవారం తెలిపారు. గృహజ్యోతి పథకం వర్తింపు కోసం లబ్ధిదారులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు, కరెంట్‌బిల్లు, ఫోన్‌నంబర్ తీసుకోని వస్తే ఆన్‌లైన్ చేస్తామన్నారు.

గుమ్మడిదొడ్డిలో ప్రత్యేక వైద్యశిబిరం



రక్త నమూనాలను సేకరిస్తున్న సిబ్బంది



రోగులను ఏటూరునాగారం తరలిస్తున్న సిబ్బంది

వాజేడు: మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో మంగళవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరాలు పెరుగటంతో పాటు కీళ్ల నొప్పులు అధికంగా ఉండటంతో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యులు తెలిపారు. జ్వరాలతో బాధపడుతున్న వారిని వాజేడు వైద్యశాలతో పాటు ఏటూరునాగారం ఏరియా వైద్య శాలకు మెరుగైన వైద్యం కోసం తరలించారు. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. కాగా గ్రామంలో గత రెండు వారాలుగా జ్వరాల తీవ్రత పెరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. వాతావరణ ప్రభావమో మరో కారణమో తెలియడం లేదని వారు తెలిపారు. ప్రతీ ఇంటిని సర్వే చేసి మెరుగైనా వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

అక్రమ లేఅవుట్ ద్వారా విక్రయిస్తే చర్యలు

గోవిందరావుపేట: మండలంలోని కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా అక్రమ లేఅవుట్ల ద్వారా ప్లాట్లు విక్రయిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, అక్రమ లేఅవుట్‌లపై చట్ట పరంగా చర్యలు తప్పవని తహసీల్దార్ నెల్లుట్ల సృజన్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. మండలంలో కొందరు డబ్బే ధ్యేయంగా అమాయకులను మోసం చేసే పద్ధతిలో రియాల్టర్ దందా ఒక్కటి అని, దళారుల చేతిలో కొనుగోలుదారులు మోసపోవద్దన్నారు. ప్లాట్లు కొనుగోలులో డాక్యుమెంట్స్ అన్ని క్షుణ్ణంగా పరిశీలించాకనే కొనుగోలు చేయాలని తెలిపారు. ఒక వెంచర్ చేయాలంటే అన్ని రకాల పర్మిషన్స్, వెంచర్‌లో ప్లాట్ కొనుగోలు దారుడికి కావాల్సిన అన్ని రకాల సదుపాయాలు ఉండాలి అని, అలా కల్పించాకనే వెంచర్ ప్రారంభించాలని లేదంటే నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.